


# తెగని తీగెలు

★

రచన :

శ్రీమతి గుత్తుర్తి ఈశ్వరీ సోమేశ్.

(2)

(గత సంచిక తరువాయి)

సూర్రావు జైలునుండి విడుదలై యింటికి చేరు కున్నాడు.

అప్పటికే రత్నం దీనస్థితికి జారిపోయింది. మాసిక లేసిన రవిక, అంగాలపై చినిగిపోయిన వోణీ పయ్యాటగా చుట్టింది. నిండు చూలాలు కావడంచేత శరీర సౌఖ్యం సరిలేక పాలిపోయిన తెల్ల మొహంతో మట్టితో కూడు కున్న శరీరం, లోతుగాపోయిన కళ్ళతో విహ్వలంగా కన్పించిన భార్యను చూసి, సూర్రావ్ నిర్ఘాంత పోయాడు.

మంచంపై పడుకున్న రత్నం వచ్చిన భర్తవంక చూసి..., "ఏమండీ!" పిలిచి రోజుతో చెప్పాలను కుంది. కాని, దుఃఖం పొర్లుకొచ్చి, వెక్కి వెక్కి ఏడ్చింది.

తను ఏడుస్తూ, భార్యను ఓదార్చ ప్రయత్నించి, "రత్నం...!" పిలుపుతో దుఃఖం తెగలు తెగలుగా వచ్చిపడింది.

"ఏమండీ...!"

"రత్నం...! యిలాగైపోయావేమి...?"

"ఏంచెయ్యనండి మీరేమైనా తిన్నారో లేదో! నువ్వు చావుస్థితికి దిగజారి, యెదుటి వాళ్ళనుకోక నీలాంటి వారెంతమంది కలరో యీలోకంలో! అలా లేవకు నేనువచ్చానుగా!" వచ్చి, మంచంపై ఆమె ప్రక్కగా కూర్చున్నాడు.

ఆమె దుప్పటిక్రింద దాచిన రొట్టెను తీసి, "మీరు కొంచెం తినండి" భర్త నోటికందిస్తూ అంది.

జాలిగా చూసి, "ఆకలి సంగతి ఆకలితో బాధ పడేవారికే తెలుస్తుంది. నేనిప్పుడే హోటల్లో తినొచ్చాను, నువ్వుతిను రత్నం!"

సూర్రావ్ వచ్చినవెంటనే యోచన చేసేందుకైనా సమయం కలిసిరాలేదు. డబ్బుకి యిబ్బంది ఏర్పడింది. పరిచయస్తులెంతో మంది జాలి చూపిస్తున్నారు కాని, సహాయానికి చాలా దూరంగా వుంటున్నారు. వాళ్ళనే కనీసం బియ్యానికైనా డబ్బు అప్పుగా తీసుకుందామని నోరు విడిచి అడిగాడు ఫలితం శూన్యం. క్రితం సైకిల్ రిపేర్ చేయించుకొని బాకీవున్న వాళ్ళనడిగాడు.

లేవన్నారు. తన సహాయం పొందినవాళ్ళు యీనాడు క్షేమంగా ఉద్యోగాల్లో వున్నారుకాని, ఒక్కరూ జాలి తలచలేదు. ఆ విచారంతో రోజురోజుకి ఎవరో ఒకరు పట్టించిన సారా త్రాగి మతితప్పి యింటికి చేరుకుంటున్నాడు.

త్రాగివచ్చిన భర్తను చూసి, రత్నం బేజారయిపోయింది. సూర్రావ్ ఊగుతూ, మత్తుగా కనురెప్పలెత్తి, "రత్నం...! నేను తాగాలని తాగలేదు, వాళ్ళే పట్టుదలగా పట్టించేస్తూన్నారు. ఆ డబ్బుని తిండికి వుపయోగిస్తానివ్వండ్రా అంటే, ఒక్కడు...ఒక్కడు... ఒక్కడివ్వడు...!"

"మీరు త్రాగనని చెప్పాలి. యిప్పుడు యింటివద్ద తినడానికేముంది చెప్పండి? అస్తమానూ ఆ సారా త్రాగితే అసలు నాకు దక్కకుండా పోతారు!"

"నువ్వు...నా భార్యగా దొరికినందుకు నిజంగా నా...అదృష్టం...!"

"ఏమండీ! యిప్పటికి మీరొచ్చిన మూడ్రోజులనుండి మనమేం తినలేదు, యిలా ఎన్నాళ్ళుంటాం? యీ బ్రతుకులు ఎలాసాగిస్తాం?"

"నువ్వేం...బాధపడకు...కష్టాలు కాపురాలుండవు" అని, నిషాలోనే యేదోచేసి సాదించాలనే వుద్రేకంతో సైకిల్ రిపేర్‌కు వుపయోగించే టూలింగుమిషన్, రెంచీలు. సుత్తిలు తీసి," ఇవి అమ్మేస్తాను. బ్రతికి బాగుంటే మళ్ళీ కొనుక్కోవచ్చు. అమ్మిన సొమ్ముతో బియ్యం, పప్పులు, కూరలు కొనుక్కొస్తాను. నువ్వు ప్రసవించిన తర్వాతయినా అవన్నీ ఎలాగు కొనాలిగా! అందుకోసం అవన్నీ యిప్పుడే తెచ్చేస్తాను. అప్పుడు మనిద్దరం హాయిగా పస్తులేకుండా గడపొచ్చు అని, బయటకు వెళ్ళిపోయాడు.

మంచం మీదనుంచి లేవలేక, "వద్దండి, అమ్మొద్దు అవి అమ్మొద్దు!" అంటూ వాపోయింది.






మీ వ్యవసాయ పనులకు సాటిలేనిది!

శ్రీ మీనాక్షి

MF

* మోటరులు. * మోనోబ్లాక్ లు. * పంపుసెట్లు.
* దీర్ఘ కాలమన్నిక. * నిశ్శబ్దమైన పరుగు.
* విద్యుచ్ఛక్తి తక్కువ.

మేము సింగిల్ ఫేస్ డొమెస్టిక్ పంపులను తయారిస్తున్నాము.

: వివరములకు :

ఫోన్ : 87477 8ని : 87288

శ్రీ మీనాక్షి ఫౌండ్రి

సింగనల్లూర్ : : కోయంబత్తూరు-641 005

డీలర్లు :— మేకలా ఎలక్ట్రికల్స్, 24, తంబుచెట్టి వీధి, మదరాసు-600 001.
శ్రీ వెంకటేశ్వరా ఇంజనీరింగ్ కార్పొరేషన్,
నెం. 5-1-496, రాణిగంజ్, సికిందరాబాద్ (ఎ.పి.)

చెల్లిని చూసేందుకు వెళ్ళాలో - మానెయ్యాలో జగన్నాథం ఒక నిర్ణయానికి వచ్చేందుకు వుత్తరంవచ్చి మూడవనెల గడచిపోతోంది. అప్పుడప్పుడు భార్య, రత్నం విషయం చెప్పేసరికి మండిపడేవాడు. భర్తతో కలిసివెళ్ళి రత్నాన్ని చూసే భాగ్యం లేదనుకొని, ఎక్కడకైనా వారు క్యాంఫ్ కెళ్ళినప్పుడు తెలియకుండా వెళ్ళిచూడాలనుకుంది జానకి.

జగన్నాథం ఆడిటింగ్ విషయమై పట్నం వెళ్తూ మూడ్రోజులు ఆలస్యమౌతుందని చెప్పి వెళ్ళిపోయాడు.

మరునాడే జానకి పిండివంటలతో రత్నం వున్న వూరికి బయల్దేరింది. భర్తకు తెలీకుండా వెళ్ళొచ్చేద్దామని ఆమె వుద్దేశ్యం.

పట్నంలో జగన్నాథం ఆడిటింగ్ విషయాలు ముగించుకొని, ఆరోజే రత్నంవుండే వూరికి చేరుకున్నాడు. అన్నాచెల్లెల రక్తసంబంధం అలా తీసుకొచ్చింది.

మానవులు మాటలతో పట్టుదలను పెంచుకుంటారు. జంతువులు చేతలతో పౌరుషాన్ని పెంచుకుంటాయి. ఋతువులు ప్రకృతితో పోటీ పడుతుంటాయి. ఎన్నిరోజులు జరిగినా అనాటితో సమసిపోకుండా అవినాభావ సంబంధం అల్లుకొనే వుంటుంది, అది వాటివాటి నైజం.

* * *

సూర్రావ్ సామాన్లు అమ్మేసి, ఆ డబ్బుతో బియ్యం మవీ కొన్నూ, మిగిలిన డబ్బుతో అలవాటు ప్రకారం సారా త్రాగిపోదామని దారిలోనున్న కంపెనీ కొట్టులో కెళ్ళాడు.

అంతలో గాంధీ అనే వ్యక్తి లోనికొచ్చాడు. అక్కడ పరిచయస్తులు చాలామంది కనిపించారు. చిన్న కూలీనుండి-పెద్దలీతగాళ్ళ వరకు యిది మచ్చుచూడందే మనిషి కాడన్న సామెతగా తయారైంది లోకం. సూర్రావ్ అంత నిషాలోను, గుర్తుతెచ్చుకొంటూ, "ఏమండోయ్ గాంధీగారు! నాకివ్వవల్సిన బాకీడబ్బు యిచ్చేస్తే, యీ యిబ్బందిలో యెంతో మేలు చేసినవాళ్ళవుతారు!" అడిగాడు.

గాంధీ, సూర్రావ్ వంక అదోలా చూసి, "పాపం! సూర్రావ్ సైకిల్ షాక తీసేయగానే బ్రతకటం చాలా కష్టమే మరి," అంటూ సారా కొలిచిచ్చేవాడివంక చూసి, "ఒరేయ్! మన సూర్రావ్ కి ఐదుడ్రాంలు సారావేసి, సోడా పోసివ్వరా!" అని, ప్రక్కనున్న కబాబ్లు కాల్చే మంగమ్మవంక చూసి, "నాల్గు కబాబ్లు కాల్చూ...!" చెప్పాడు దర్జాగా.

"ఏమండీ గాంధీగారు! యిప్పటికే నేను బాగా త్రాగాను. ఆసారా మానేసి, ఆ డబ్బు నాకిస్తే ఓయ్యమవీ కొనుక్కుంటాను!" ప్రాధేయపడ్డాడు.

"అదేం లాభంలేదు, యిది డబ్బయ్యే డబ్బు!"

"పోనీ, యీ విధంగా ఖర్చుపెడుతున్నారుగదా! సారా నాకొద్దు డబ్బిప్పించండి!"

"గ్లాసులోది గాలిపోతుంది ముందది తీసుకో యీ విధంగా యింకొంత ఖర్చుపెడతానుగాని, డబ్బివ్వలేను సారాకొట్టు కాబట్టి రొక్కం లేకపోయినా అరువు యిస్తారు. ఈ కొట్టుదాటితే అదీదక్కదు. మరి నీయిష్టం!"

సూర్రావ్ కాదనలేక త్రాగి, కబాబ్లు తింటున్నాడు.

తమిళనాడు ప్రభుత్వమువారిచే
అంగీకరించబడినది.
Regd. No. MDU-SSI-23-231-1-02
ఎల్లప్పుడూ...
LOTUS HAND LOOMS MADURAI.
లోటస్ బ్రాండ్
బెడ్ షీట్స్, టవల్స్, దోవతులు,
టర్కీ జక్కార్డ్, టవల్స్ మరియు
నేప్కిన్స్‌నే వాడండి!
: తయారించువారు :
లోటస్ టెక్స్‌టైల్స్
13, ఖాన్ పాలయం 4-వ వీధి,
మధురై - 625 009.

నిషామీద యీ కబుర్లు కారంతో సూర్రావ్ మతిని పూర్తిగా కోల్పోయాడు. భూమి తనచుట్టూ తిరుగుతున్నట్లనిపించింది.

హోరుమని గాలితో దూళిని రేపింది. ఆకాశమంతా కారుమేఘాలతో ప్రకృతినంతా చీకటిగా చేసింది. తళ తళ మెరుపులతో ప్రకృతినంతా చీకటిగా కంపించాయి వర్షం కురుస్తోంది.

సూర్రావ్ వర్షంలో తడుస్తూనే సామాన్లతో తూగుతూ తూగుతూవచ్చి గడపదాటి యింట్లోకి చేరి నేలపై బోర్లాపడిపోయాడు.

గదిలో మినుకు మినుకుమని దీపంబుడ్డి వెలుగుతోంది. ఆ మసక వెలుతురులో రత్నం అప్పటికే చిన్నచిన్న నొప్పులతో కుములుతున్నా, భర్త పరిస్థితి చూసి, అధురాగా లేవబోయిందికాని, లేవ లేక విపరీతమైన బాధతో లేచి, "ఏమండీ...!" అని అడుగులో అడుగు వేస్తుంది. జుట్టు ముడి విడిపోయి చెదరిన తలతో పిచ్చి దానిలా నొప్పులను తట్టుకోలేక బాధతో మూల్గింది. పొత్తికడుపుపై చేతులాన్చి గావుకేకలు వేస్తూ తనవంటి మీద తనకే తెలివిలేని స్థితిలో కళ్ళుపెద్దవిచేసింది. యిలా నొప్పులబాధతో నుమ్మలుచుట్టుకుపోతూ 'దభ్' మని సూర్రావ్ ప్రక్కగా పడిపోయింది.

సూర్రావ్ గొంతులో తడారిపోయి. లేవటానికి సత్తువలేక మత్తుగా కనురెప్పలెత్త లేక చేతులు చాపబోయి శక్తిలేక, "ర...త్నం...ం—దా...హా...ం" అని, దాహంతో నోరు పిడచకట్టుకుపోయి, నాలుక లాక్కుపోతూ సోలిపోయాడు.

♦ ♦ ♦

జగన్నాథం జానకి ఒకర్నొకరు తెలీకుండా యింటి వరండాలో కలుసుకున్నారు. ఇరువురూ అచేతనంగా చూసుకోవడం తప్పమాటల్లేవు. లోపలనుండి స్త్రీ మూలుగుతున్న శబ్దం విని ఆత్రంగా యిద్దరూ లోనికి ప్రవేశించి, నొప్పులతో కష్టపడుతున్న రత్నంను సాయంగా పట్టుకొని, బయటకు తీసుకొస్తున్నారు.

సూర్రావ్—"దా...హా...ం" అంటూ కనుపాపలు పెద్దవిచేసి చూస్తున్నాడు. జానకి, సూర్రావ్‌కి నీళ్ళు పట్టిద్దామనుకుంటూన్న, రత్నంతో బయట రిక్షాలో కూర్చొని హాస్పటల్‌కు చేరుకున్నారు.

సూర్రావ్ నిషాలో ఎటూ కదల్లేక దాహంతో గొంతు తడారిపోయి, కళ్ళుపెకలికి అతికష్టంమీద ప్రాణం పోయింది.

రత్నం మగబిడ్డను కన్నది.

సేద తీర్చుకున్న తరువాత రత్నంకి అన్నయ్య వదినలు తప్ప తన భర్త కనిపించలేదు. కంటతడితో వాటిని పలుకరిస్తూ—"మా వారేరి?" అడిగింది.

"........."

రెండ్రోజులు గడచిన తరువాత జానకి రత్నం ప్రక్కగా కూర్చొని జరిగిందంతా శాంతంగా చెప్పింది. రత్నం మనసు చిదిగిన అద్దంలా చెదరి తిరిగా అతుక్కోలేకపోయింది.

పుట్టిన బిడ్డకు శ్రీధర్ అని పేరుపెట్టారు.

రత్నం హాస్పటల్ నుండి డిశ్చార్జి అయింతరువాత అన్నయ్య, వదిన వాళ్ళింటికి తీసుపోదామని ప్రయత్నించారు. అందుకు రత్నం మనసు అంగీకరించలేదు. "అన్నయ్యా! నా భర్త బ్రతికుండగా గౌరవించి ఆదరించలేకపోయారు, అతడి భార్యనే నేను. నాకళంకం మీకు చేరనియ్యకండి, నా భర్త స్వగ్రామంపోయి యేదో పనిపాట్లు చేసుకొని నా బిడ్డా, నేను బ్రతుకుతాం" అని చెప్పి, శ్రీధర్‌ను సందిటితో ఎత్తుకొని నడచింది.

"చెల్లీ"

"రత్నం..." పిలిచారిద్దరూ ఆగింది "నీ మనసు మార్చుకోలేవా—?" యిద్దరూ ఏక కంఠంతో ప్రాధేయపడ్డారు.

"మార్చుకోలేను..." అంటూ కాకినాడ చేరే బస్ ఎక్కింది—

కాకినాడకు కొద్దిదూరంలోనున్న సూర్రావ్ స్వగ్రామం రత్నం, శ్రీధర్ చేరుకున్నారు.

♦ ♦ ♦

కొన్ని సంవత్సరాలు గడిచిపోయింది.

జగన్నాథం ఎ.సి.టి.ఓ.గా ప్రమోషన్‌పై కాకినాడకు ట్రాన్సుపర్ అయ్యారు, తన ఏకైక సంతానం నిర్మలను ఇంటర్‌లో చేర్పించారు.

జానకమ్మ భర్తను ఒప్పించి ప్రక్క పల్లెటూర్లో వుంటున్న రత్నమ్మవద్దకు నిర్మలతో సహా చేరుకున్నారు.

ఆ సంవత్సరమే శ్రీధర్ ఇంటర్ క్లాస్‌లో పాసయాడు. జగన్నాథం, జానకమ్మ, రత్నమ్మను నచ్చచెప్పి, శ్రీధర్‌ను మేం చదివిస్తామని కాకినాడకు తీసుకుపోయి కాలేజిలో చేర్పించారు.

కాలం గడుస్తోంది.

కాలేజి వార్షికోత్సవాలు వచ్చాయి. విద్యార్థులందరకు సంతోషంగావుంది. అందులోను కల్చరల్ అక్టివిటీస్‌లో పాల్గొన్నవారికి మరీ హడావిడిగా వుంది. వారిలో ఎ.జి.బి.యస్సీ. చదువుతున్న శ్రీధర్ ఒకడు.

రాత్రి పన్నెండు దాటింది శ్రీధర్ గదిలో స్టాండుకు అమర్చిన డ్రాయింగ్ షీటుపై నెహ్రూ చిత్రం చక్కగా గీసి, తుది మెరుగులు దిద్దుతూ, కడకు చిత్రాన్ని పూర్తి చేసి, మరునాడు జరగబోయే ఎగ్జిబిషన్ పోటీలో ప్రథమ బహుమతి తనకే వస్తుందని మురుస్తూ, అచ్చట నున్న రంగులవీ సర్దకుండా-లైటార్పకుండానె యేవేవో ఆలోచిస్తూ పక్కమీద మేను వాల్చాడు బద్ధకంగా.

బాలభానుడు ఉదయిస్తున్నాడు ప్రకృతి యెంతో అందంగావుంది. పక్షులు కిచకిచ ధ్వనులతో పరుగులు తీస్తున్నాయి. శ్రీధర్‌కు మెలకువ వచ్చి నలుప్రక్కలా చూసాడు. గదంతా శుభ్రంగా సర్ది వున్నట్టయింది. తను చిత్రించిన డ్రాయింగుషీటు భద్రంగా చుట్టి టేబుల్ మీద పెట్టివుంది. ఈ పని నిర్మలే చేసివుంటుందని ఆమెను మనసులోనే మెచ్చుకుంటూ లేచి, కాలకృత్యాలు తీర్చుకున్నాడు.

పోటీలో పాల్గొనే వేళకు ముందుగా భద్రంగా చుట్టివుంచిన చిత్రాన్ని తీసుకొని కాలేజికి శ్రీధర్ బయల్దేరాడు. వరుసగా అందరి చిత్రాలు చూస్తూ తనవంతు వచ్చేసరికి అక్కడవాళ్ళతోబాటు తన చిత్రం చూసి నిర్ఘాంతపోయాడు. తానువేసిన నెహ్రూబొమ్మ రకరకాల రంగులతో అలికినట్టు వికృతంగావుంది శ్రీధర్ అవమానంతో తలెత్తలేకపోయాడు. జరిగిందానికి విస్తుపోయాడు అక్కడున్నవారు గొల్లున నవ్వేరు, హేళన చేసారు. యీ చిత్రం పాడుచేసిందెవరు? నేను వేసిన యీ చిత్రం చుట్టగాచుట్టి టేబుల్ మీద పెట్టిందెవరు? నా మంచితనం చారతం చూసి ఓర్వలేక నిర్మల చేసినపనే యిది! అని తలంచి, నలుగురి నవ్వుల మధ్య నిలవలేక గబగబ అడుగులు వేస్తున్నాడు శ్రీధర్.

సగం దూరంలో, నిర్మల యెదురుగా రిక్షాలో వస్తోంది. రిక్షా దగ్గరవగానే, "శ్రీధర్...!" అని పిలిచి చిన్నగా నవ్వింది. ఆ నవ్వులో శ్రీధర్‌కు వేయి వెక్కిరింపులు కనిపించాయి, ఆ క్షణంలో నిర్మలపై అపుకోలేని కోపం వచ్చింది. ఉద్రేకం పట్టలేక రిక్షాలోకి వంగి, నిర్మల చెంప చెళ్-మనిపించాడు.

"శ్రీధర్..." గావుకేక వేసి, స్పృహ తప్పి ఒరిగి పోయింది నిర్మల. శ్రీధర్ కోపంతో తన చేతిలోనున్న చిత్రాన్ని చింపి, రిక్షాలోనే విసిరి, వెళ్ళిపోయాడు.

రిక్షావాడు నిర్మలను మెల్లగా ఇంటికి చేర్చి, జరిగింది జరిగినట్టుగా విషయమంతా చెప్పాడు. నిర్మల చెప్పక పోయినా రిక్షావాడిద్వారా జగన్నాథంగారు అంతా గ్రహించి కోపంగా, "వాడు యింటికి రానీ చెప్తాను!" అని పళ్ళు పటపటలాడిస్తూ ఊద్రేకం పొందారు.

ఆ రాత్రికి శ్రీధర్ ఇంటికి చేరలేదు.

(సశేషం)

Tel: Export Phone: 21443

ఏనుగు బ్రాండ్

CARNATAKA KNITTING COMPANY

INDIA

CKC

"సి. కె. సి." బనియన్లు
ధరించుటకు హాయినిచ్చును.
అన్ని చోట్ల దొరుకును.

: తయారించువారు :

The Carnataka Knitting Co.

Post Box No. 252

TIRUPUR-638 602